భీమడోలు రైల్వే స్టేషన్‌లో సమస్యల తిష్ట

- ఆదాయం ఘనం. అభివృద్ధి శూన్యం
- ఎక్స్‌ప్రెస్‌లు ఆపాలని కోరుతూ వినతులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు
- పేదవాని ప్రయాణానికి.. జేబులు చిల్లు

భీమడోలు: భీమడోలు రైల్వే స్టేషన్ చుట్టూ సమస్యలు కూత కూస్తున్నాయి. తక్కువ ధరతో దూర ప్రాంతాలకు వెళ్లే పేద, సామాన్య వర్గాలకు చేరువ కావాల్సిన రైల్వే శాఖ... వారికి అమడ దూరంలో నిలుస్తోంది. ప్రముఖ పుణ్యక్షేత్రం ద్వారకాతిరుమలకు వెళ్లేందుకు దగ్గర మార్గంగా ఉన్న ఈ రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి, వసతుల కల్పనలో రైల్వే అధికారులు, పాలకుల నిర్లక్ష్యం వల్ల సమస్యలు ఎక్కడి వేసిన గొంగళిగా దర్శనమిస్తున్నాయి. పలు సాకులతో ఎక్స్‌ప్రెస్ రైళ్లను తగ్గించడం, రిజర్వేషన్ కౌంటర్‌ను సైతం రద్దు చేశారు. దీంతో జిల్లాలోని పలు రైల్వే స్టేషన్లపై చూపే శ్రద్ధ బ్రిటిష్ కాలం నాటి భీమడోలు రైల్వేస్టేషన్‌పై చూపడం లేదని బాహాటంగా విమర్శిస్తున్నారు. ఈ స్టేషన్‌లో పలు రైళ్లను ఆపితే రైల్వే శాఖ, ద్వారకాతిరుమల పుణ్యక్షేత్రానికి ఆదాయం సమకూరుతుంది. ఇక్కడ గతంలో నిలిచే ప్యాసింజర్ల స్థాయి పెంచి ఎక్స్‌ప్రెస్‌లుగా మారి గ్రామీణ ప్రాంతాల్లో హాల్టలను ఎత్తి వేశారు. కాకినాడ–తిరుపతి, రాయగడ ప్యాసింజర్లను ఎక్స్‌ప్రెస్ రైళ్లగా మారి భీమడోలులో హాల్ట్ ఎత్తివేశారు. ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపకపోవడం,

పుట్‌పాత్ బ్రిడ్జిను విస్తరించాలని, వసతులు కల్పించాలని ఏన్నో ఏళ్లుగా యాత్రికులు, భక్తులు వేడుకుంటున్నా అధికారులకు పట్టడం లేదు. ఐదేళ్లకొకసారి పాలకులు మారుతున్నా రైల్వే స్టేషన్ రూపు రేఖలు మారకపోవడంతో సమస్యలతో కొట్టుమిట్టాడుతుంది. అదే విధంగా భీమడోలు రైల్వే స్టేషన్‌లో మూడు ప్లాట్‌పారమ్‌లు ఉండగా కేవలం రెండు ఫ్లాట్‌ఫారమ్స్‌లను దృష్టిలో ఉంచుకుని గతంలో నిర్మించిన పుట్‌పాత్ ఓవర్ బ్రిడ్జిని విస్తరించాలని కోరుతున్నారు. మూడో ప్లాట్‌ఫారమ్ వద్ద రైల్వే ట్రాక్‌పై గూడ్స్ రైలు నిలిచిపోతున్నా క్రమంలో ఆ ట్రాక్‌ను దాటాలంటే ప్రయాణికులు నరకయాతనను అనుభవిస్తున్నారు. వాస్తవానికి రైల్వేస్టేషన్ జాతీయ రహదారికి అనుబంధంగా ఉంటుంది. దీంతో రైలు దిగిన ప్రయాణికులు హైవే వైపుకు రావాలంటే ఖచ్చితంగా పుట్‌ఫాత్ బ్రిడ్జి నుంచి అవతలకు వెళ్లాలి. కానీ పూర్తి స్థాయిలో బ్రిడ్జి నిర్మాణం లేనందున నరకయాతనను అనుభవిస్తున్నారు. ఇటీవల ఏలూరు వచ్చిన రైల్వే శాఖ జీఎంను కలిసి పుట్‌ఫాత్ బ్రిడ్జిని విస్తరించాలని, సమస్యలను పరిష్కరించాలని గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. ఏదీ ఏమైనా భీమడోలు రైల్వేస్టేషన్ సమస్యలను పరిష్కరించాలని భక్తులు, యాత్రికులు, సందర్శకులు, గ్రామస్తులు పాలకులను ముక్తకంఠంతో వేడుకుంటున్నారు.



భీమడోలు రైల్వే స్టేషన్‌లో మూడో ఫ్లాట్‌ఫామ్ వరకు లేని పుట్‌పాత్ బ్రిడ్జి



భీమడోలు రైల్వేస్టేషన్‌లో బ్రిటిష్ కాలం నాడు ఏర్పాటు చేసిన సూచిక బోర్డు



స్టేషన్ నుంచి బయటకు వస్తున్న ప్రయాణికులు

వివక్ష చూపుతున్న రైల్వే శాఖ

ద్వారకాతిరుమల పుణ్యక్షేత్రం సందర్శకులు, ఆదాయపరంగా ప్రత్యేక గుర్తింపు పొందింది. ద్వారకాతిరుమల దేవాలయానికి ప్రతి 20 రోజులకొకసారి యాత్రికుల కానుకల రూపంలో రూ.3కోట్ల ఆదాయం సమకూరుతుంది. అయినా భీమడోలు రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి, ఇతర సౌకర్యాల పట్ల రైల్వే శాఖ వివక్ష చూపుతుందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అన్నవరం తరహాలో భీమడోలులో రైళ్ల ఆగడం లేదు. యాత్రికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని పలు రైళ్లను నిలుపుదల చేసి, ప్రత్యేక అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని యాత్రికులు కోరుతున్నారు.

సమస్యలను పరిష్కరించాలి



ద్వారకాతిరుమల పుణ్యక్షేత్రానికి వెళ్లే భక్తుల సౌకర్యార్థం భీమడోలు రైల్వే స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపాలని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్, ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజులకు వినతిపత్రం అందించాం. ఇప్పటికైనా అధికారులు స్పందించి రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి చేయాలని కనీస వసతులు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

ముప్పిరిశెట్టి సుబ్రహ్మణ్యం,
సామాజిక ఆరోగ్య కేంద్రం సభ్యుడు, భీమడోలు

సమస్యలను రైల్వే జీఎం దృష్టికి తీసుకుని వెళ్లాం



భీమడోలు రైల్వేస్టేషన్‌లోని సమస్యలన్నింటిని రైల్వే జీఎంను కలిసి వివరించాం. మూడు ట్రాక్‌లకు సరిపడేంత పుత్‌పాట్ వంతెనను నిర్మించాలని కోరాం. ద్వారకాతిరుమలకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపాలని వినతి పత్రం అందజేశారు. పుట్‌పాత్ లేకపోవడంతో మహిళలు, వృద్ధులు, పిల్లలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళల్లో వారు పడే ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లాం. అభివృద్ధి సమస్యలన్నింటి పరిష్కారించాలని వేడుకున్నాం. సానుకూలంగా స్పందించారు.

టీవీ ఉమామహేశ్వరరావు,
మానవత జిల్లా డైరెక్టర్, భీమడోలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

పెదవేగి : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయని పెదవేగి ఎస్సై కె.రామకృష్ణ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నూజివీడు మండలం సునకొల్లు గ్రామానికి చెందిన గొల్లపల్లి కనకాంబరం ఈనెల 11న లింగపాలెం మండలం సింగగూడెం గ్రామంలో ఓ గృహ ప్రవేశ కార్యక్రమానికి హాజరై మరుసటి రోజు 12వ తేదీన జిల్లా కేంద్రమైన ఏలూరుకు పనిమీద ద్విచక్రవాహనంపై వెళ్తుండగా, పెదవేగి మండలం రామచంద్రపురం వచ్చేసరికి వెనుక నుంచి వ్యాన్ ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టడంతో కనకాంబరానికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు బాధితుడిని చింతలపూడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం విజయవాడ తరలించినట్లు, ఆసుపత్రి సమాచారంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నిబంధనలు పాటించాలి



గణపవరంలో బాణసంచా వ్యాపారులకు సూచనలిస్తున్న సీఐ రజనీకుమార్

గణపవరం: దీపావళి బాణసంచా వ్యాపారులు నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని, ఎలాంటి ప్రమాదాలకు తావులేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని గణపవరం సిఐ నక్కా రజనీకుమార్ బాణసంచా వ్యాపారులకు సూచించారు. గురువారం ఆయన సర్కిల్ పరిధిలోని బాణసంచా హోల్‌సేల్, రిటైల్ దుకాణదారులతో సమావేశం నిర్వహించి వారికి సూచనలు ఇచ్చారు. ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా అగ్నిప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందన్నారు. నిబంధనలు పాటించకుంటే లైసెన్సులను చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

క్లుప్తంగా

జశ్వీక నారాయణ్‌కు అభినందనలు



ఛాంపియన్‌షిప్ పొందిన జశ్వీక నారాయణ్

దెందులూరు: మండలంలోని గోపన్నపాలెం కేంద్రీయ విద్యాలయంలో ఐదవ తరగతి చదువుతున్న అంతర్వేది జశ్వీక నారాయణ్ ఆటల పోటీల్లో ఛాంపియన్‌షిప్ కైవసం చేసుకుంది. కబడ్డీ, రన్నింగ్, హ్యాండ్ బాల్ విభాగాల్లో జరిగిన పోటీల్లో అత్యుత్తమంగా రాణించి ఛాంపియన్‌షిప్ కైవసం చేసుకుంది. ఏ. జశ్వీక నారాయణ్‌ను పలువురు అధికారులు, కేంద్రీయ విద్యాలయ సిబ్బంది అభినందించారు.

నేడు పుంతలో ముసలమ్మ విగ్రహ ప్రతిష్ట

దెందులూరు: మండలంలోని చల్లచింతలపూడి గ్రామం కొత్త కమ్మవారిగూడెంలో దాత కమ్మ నరేంద్రరత్న మాణిక్యం దంపతులతోపాటు గ్రామస్తుల ఆర్థిక సహాయ సహకారాలతో నిర్మించిన పుంతలో ముసలమ్మ అమ్మవారి నూతన ఆలయం విగ్రహ ప్రతిష్ట శుక్రవారం ఉదయం 11.52 గంటలకు జరుగుతుందని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఆలయ వారం రోజుల పాటు ప్రత్యేక హోమాలు జరుగుతాయన్నారు. ఆలయ ప్రారంభోత్సవం విగ్రహ ప్రతిష్ట పూజలు అనంతరం ఆలయ ఆవరణలో భారీ అన్న సమారాధన నిర్వహిస్తామన్నారు. దెందులూరుతో పాటు సమీప మండలాల్లో భక్తులు నూతన ఆలయ విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని అమ్మవారిని దర్శించుకోవాలని కోరారు.

నేడు దెందులూరు మండల సర్వసభ్య సమావేశం

దెందులూరు: దెందులూరు మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ బొమ్మన బోయిన సుమలత అధ్యక్షతన ఉదయం 11 గంటలకు జరుగుతుందని ఎంపీడీవో ఎం భీమరాజు తెలిపారు. ఎంపీటీసీలు అన్ని శాఖల మండల అధికారులు విధిగా సమావేశానికి హాజరుకావాలని ఎంపీడీవో కోరారు.

18 వరకు అంగన్‌వాడీలకు రేషన్ పంపిణీ

దెందులూరు: అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వాహకులు ఈనెల 18వ తేదీ వరకు రేషన్ తీసుకోవచ్చని పౌరసరఫరాల శాఖ దెందులూరు మండలం డిప్యూటీ తహసీల్దార్ నాగరాజు అన్నారు. గురువారం దెందులూరు మండల తహసీల్దార్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మండలంలో 41 రేషన్ షాపులు ఉన్నాయని తెలిపారు. 41 రేషన్ షాప్ పరిధిలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల నిర్వాహకులు రేషన్ షాపులకు వచ్చి సరుకులను తీసుకొని వెళ్లవచ్చని తెలిపారు. అన్ని గ్రామాల్లో రేషన్ డీలర్లు అంగన్‌వాడీ కేంద్రాలకు సమాచారాన్ని తెలియజేయాలన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



భీమడోలు కళాశాలలో క్రీడల్లో రాణించి ప్రశంసా పత్రాలను అందుకున్న విజేతలు

భీమడోలు: భీమడోలు జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల ఆవరణలో మేరా యువ కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన బ్లాక్ స్థాయి ఆటల పోటీలు ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. ఆట స్థలంలో కబడ్డీ, వాలీబాల్, రన్నింగ్ పోటీలు నిర్వహించారు. ఫిజికల్ టీచర్ సురేష్ ఆధ్వర్యంలో క్రీడాకారులు తమ క్రీడా నైపుణ్యాన్ని చాటారు. క్రీడల్లో రాణించిన వారికి ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. తొలుత ఈ క్రీడా పోటీలను ప్రిన్సిపల్ బొమ్ము రవికుమార్ ప్రారంభించారు. చదువుతో పాటు క్రీడల్లో రాణించడం ద్వారా ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో యువ కేంద్రం సిబ్బంది, అధ్యాపకులు, యువతీ యువకులు పాల్గొన్నారు.

భీమడోలు బస్టాండ్‌లో డాగ్ స్క్వాడ్ బృందం తనిఖీలు



భీమడోలు బస్టాండ్‌లో పార్సిల్‌కు వచ్చి వస్తువులను పరిశీలిస్తున్న డాగ్ స్క్వాడ్ బృందం

భీమడోలు: భీమడోలు బస్టాండ్‌లో డాగ్ స్క్వాడ్ బృందం గురువారం తనిఖీలు చేసింది. ప్రాంగణంలో ఉన్న కొరియర్ పార్సిల్ సర్వీసుకు వచ్చిన, తరలించే వస్తువులను క్షుణ్ణంగా పరిశీలించారు. బస్సుల్లోని సీట్లను, ప్రయాణికుల వద్ద ఉన్న వస్తువులను పరిశీలించారు. పండుగల నేపథ్యంలో ఎటువంటి గంజాయి, డ్రగ్స్ వంటి నిషేధిత వస్తువులపై జిల్లా స్థాయి ఉన్నతాధికారుల పటిష్టమైన నిఘా ఉంచడంతో స్క్వాడ్‌లోని బృందం సభ్యులు నిశితంగా పరిశీలించారు.

దంత వైద్య శిబిరం

పెదపాడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సెయింట్ జోషఫ్ కళాశాల వైద్యులు దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఈశిబిరంలో విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. శస్త్ర చికిత్సలు అవసరమైన వారికి ఆసుపత్రిలో చికిత్స అందిస్తామని చెప్పారు.

నేడు నర్సింగ్ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు

దెందులూరు: దెందులూరు డీఆర్‌డీ నర్సింగ్ కళాశాలలో శుక్రవారం ఫ్రెషర్స్ డే వేడుకలు జరుగుతాయని కళాశాల కరస్పాండెంట్ సుగ్గిశెట్టి నూకరాజు తెలిపారు. సీనియర్లు జూనియర్లకు ఫ్రెషర్స్ డే సందర్భంగా స్వాగతం పలుకుతూ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారి తెలిపారు.

ధాన్యం కొనుగోలులో నిబంధనలు పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ బి.రమాదేవి, ఏవో ఎస్‌పీవీ ఉషారాణి తదితరులు

భీమడోలు: సార్వా ధాన్యం కొనుగోలు తరుణంలో రైతులకు ఎటువంటి ఇబ్బందులకు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత రైస్ మిల్లు కస్టోడియన్లు, వ్యవసాయ సిబ్బందిపై ఉందని భీమడోలు తహసీల్దార్ బి.రమాదేవి అన్నారు. భీమడోలు ఎంపీపీ సమావేశ మందిరంలో గురువారం సార్వా ధాన్యం కొనుగోళ్లపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ధాన్యం తేమ శాతం తదితర అంశాలపై రైస్‌మిల్లు కస్టోడియన్లు, వీఏఏలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏవో ఎస్‌పీవీ ఉషారాణి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన తహసీల్దార్ బి.రమాదేవి మాట్లాడుతూ రైతుల నుంచి ధాన్యం సేకరించే తరుణంలో ఖచ్చితంగా నిబంధనలు పాటించాలన్నారు. రైతులకు నాణ్యత గల గోనె సంచులను అందజేయాలని, చిరుగులు గల సంచులు వస్తే మిల్లుల యాజమానుల దృష్టికి తీసుకుని వెళ్లి వాటిని మార్చుకోవాలన్నారు. ఎక్కడ రైతులకు ఇబ్బందులు రాకుండా చూడాలని, లేని పక్షంలో శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ జి.భరత్‌కుమార్, వీఆర్వోలు పాల్గొన్నారు.

నాలుగు గ్రామాల్లో రీసర్వే పనులు



రీసర్వే చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

దెందులూరు: నాలుగు గ్రామాల్లో రీసర్వే పనులు జరుగుతున్నాయని దెందులూరు మండల తహసీల్దార్ బి సుమతి తెలిపారు. గురువారం దెందులూరు తహసీల్దార్ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ మండల రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ రవిచంద్ర ఆధ్వర్యంలో మండల సర్వేయర్ అన్ని గ్రామాల సర్వేయర్లు, వీఆర్‌ఓలు, వీఆర్ఏలు సమన్వయంతో నాగులదేవునిపాడులో 638 ఎకరాలు, సింగవరంలో 774 ఎకరాలు, వేగవరంలో 738 ఎకరాలు, గోపన్నపాలెంలో 423 ఎకరాల్లో సరిహద్దులు నిర్ణయించడం జరుగుతుందన్నారు. రైతులకు ముందుగా నోటీసులు ఇవ్వడం జరిగిందన్నారు. గ్రామస్థాయిలో రీ సర్వే సిబ్బందికి రైతులు నేరుగా పొలాలకు వచ్చి సరిహద్దులు నిర్ణయించేందుకు తమ పూర్తి సహాయ సహకారాలు అందజేయాలని తహసీల్దార్ కోరారు. దెందులూరు మండలంలో మొదటి ఫేజ్ లో రెండు గ్రామాల్లో రీసర్వే పనులు పూర్తయ్యాయన్నారు.

వైద్యుల డిమాండ్లను పరిష్కరించాలి



గుండుగొలను పీహెచ్‌సీ వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న ఆశావర్కర్లు

భీమడోలు: వైద్యులు తమ న్యాయమైన సమస్యల సాధన కోసం చేస్తున్న సమ్మెకు సంఘీభావం తెలుపుతూ ఆశావర్కర్లు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఆశావర్కర్ల యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో గుండుగొలను పీహెచ్‌సీ వద్ద గురువారం పీహెచ్‌సీ పరిధిలోని ఆశావర్కర్లు ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై నినాదాలు చేసి నిరసన వ్యక్తం చేశారు. పది రోజులుగా గ్రామీణ ప్రాంతాల్లోని వైద్యులు సమ్మె చేస్తుంటే ప్రభుత్వం తమకు పట్టనట్లు వ్యవహారించడం వల్ల పేదలకు వైద్యం దూరమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. టైమ్‌బాండ్ పదోన్నతులు కల్పించాలని, ఇన్ సరీ్వస్ కోటను పెంచాలని, నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని, గిరిజన ప్రాంతాల్లో సేవలందిస్తున్న వైద్యులకు 50 శాతం మూల వేతనం పెంచాలని, చంద్రన్న సంచార చికిత్స కార్యక్రమానికి రూ.5వేలు భత్యం మంజూరు చేయాలని తదితర డిమాండ్లతో వైద్యులు ఆందోళన చేస్తున్నారని, వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని వారంతా కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకురాలు నయోమి, వివిధ గ్రామాలకు చెందిన ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి వ్యాసరచన పోటీల్లో విజేత రిషిత



రిషిత

ఏలూరు (ఆర్ఆర్‌పేట): సూపర్ జీఎస్‌టీ – సూపర్ సేవింగ్స్‌లో భాగంగా పాఠశాల విద్యార్థులకు రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన కె.రిషిత విజేతగా నిలవడం జిల్లాకు గర్వకారణమని జిల్లా విద్యాశాఖాధికారి ఎం వెంకట లక్ష్మమ్మ అన్నారు. నిడమర్రు మండలం చిన్ననిండ్రకొలను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న రిషిత వ్యాసరచన, చిత్రలేఖన పోటీల్లో విజేతగా నిలిచిందన్నారు. రిషితను జిల్లా సమగ్ర శిక్షా అదనపు పథక సమన్వయకర్త కె.పంకజ్ కుమార్, జిల్లా అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ రెడ్డి రామారావు, నిడమర్రు మండల విద్యాశాఖాధికారులు అనురాధ, శేషగిరిరావు, ప్రధానోపాధ్యాయుడు జి.మల్లికార్జునరావు అభినందించారని పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి ర్యాంకుల సాధనకు కృషి చేయాలి



ఉపాధ్యాయుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో బాలయ్య

గణపవరం: పదోతరగతి పబ్లిక్ పరీక్షలలో రాష్ట్ర స్థాయి ర్యాంకుల సాధనకు ఉపాధ్యాయులంతా చిత్తశుద్ధితో కృషి చేయాలని గణపవరం ఎంఈవో గొర్రెల బాలయ్య సూచించారు. గురువారం గణపవరం మండలం పిప్పర ఉన్నత పాఠశాలలో ఆయన నూతనంగా నియమితులైన ఉపాధ్యాయులతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో నూతనంగా 40 మంది ఉపాధ్యాయులు విధులలో చేరారని, దీనితో మండలంలోని అన్ని ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత పూర్తి స్థాయిలో తీరిందన్నారు. అన్ని సబ్‌జెక్టులకు ఉపాధ్యాయులు ఉండటంతో ఇక బోధనపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ముఖ్యంగా పదోతరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, సి,డి గ్రేడుల్లో ఉన్న విద్యార్థులకు ప్రత్యేక బోధన చేసి వారిని పై గ్రేడులోకి వచ్చేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఉదయం సాయంత్రం ప్రత్యేకంగా కొంతసమయం వారికి శిక్షణ ఇవ్వాలని సూచించారు. ప్రాథమిక పాఠశాలల్లో ప్రతి రోజూ ఒక్కో విద్యార్థికి కనీసం రెండు లైన్లు రాసేలాగా, ఉన్నత పాఠశాలల్లో రెండు నాలుగు మార్కుల ప్రశ్నలకు జవాబు తప్పని సరిగా రాయించాలన్నారు. హెచ్ఎంలు ప్రతి రోజూ ఉపాధ్యాయుల పనితీరును సమీక్షించి తగిన సూచనలు ఇవ్వాలని, టీచర్స్ హేండ్‌బుక్, డైరీ, విద్యార్థుల డైరీలను తనిఖీ చేయాలని తెలిపారు. ఈసమావేశంలో పలువురు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

గోవుల అక్రమ రవాణా అడ్డగింత

పెదపాడు: జాతీయ రహదారిపై అక్రమంగా మూడు కంటైనర్‌లలో తరలిస్తున్న గోవులను బుధవారం రాత్రి అడ్డుకున్నారు. సుమారు 75గోవులను అక్రమంగా తరలిస్తుండగా దెందులూరు ఏఎంసీ తనిఖీ కేంద్రం వద్ద సిబ్బంది తనిఖీ చేస్తుండగా కంటైనర్ యజమానులు, వాహనాల సిబ్బంది వారిపై దురుసుగా ప్రవర్తించారు. ఎవరైనా అడ్డువస్తే వాహనాలతో తొక్కించుకుంటూ పోతామని బెదిరింపులకు దిగారు. వెంటనే స్థానిక నాయకులకు సిబ్బంది సమాచారం అందించారు. వెంటనే బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రం కిశోర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రామసీతలు అక్కడకు చేరుకోవడంతో వాహనదారులు పరారయ్యారు. దీనిపై వెంటనే పోలీసులకు సమాచారం అందజేశారు. గోవులు అక్రమ రవాణాకు వీలులేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఈ ఘటనపై కేసులు నమోదు చేస్తామని పెదపాడు ఎస్ఐ శారదాసతీష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పార్లమెంట్ అధ్యక్షుడు కట్నేని కృష్ణప్రసాద్, అనిల్, వేమూరి తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ సంస్కరణలతో ఆర్థికంగా లబ్ధి

ఉంగుటూరు: జీఎస్టీ శ్లాబ్ తగ్గింపు వల్ల సామాన్య, మధ్య తరగతి ప్రజలకు మేలు చేకూరుతుందని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు తెలిపారు. గురువారం జీఎస్టీపై నారాయణపురం నుంచి ఉంగుటూరు వరకు రవాణాశాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రవాణా శాఖ అధికార్లు పాల్గొన్నారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న పెదవేగి సీఐ రాజశేఖర్

దెందులూరు: యువత డ్రగ్స్ పట్ల అవగాహన పెంపొందించుకొని జీవితాలను ఉన్నత స్థితికి చేరుకునేలా నడుచుకోవాలని పెదవేగి సీహెచ్ రాజశేఖర్ అన్నారు. గురువారం వేగవరం హేలాపురి ఇంజనీరింగ్ కళాశాలలో దెందులూరు ఎస్సై రాచమల్లు శివాజీ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాలపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పెదవేగి సీఐ రాజశేఖర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ జీవితం పట్ల ఉన్నత ప్రణాళిక ఉండాలన్నారు. ఆ ప్రణాళికను నిజం చేసుకునేందుకు నిరంతర సాధన క్రమశిక్షణతో కృషి చేయాలన్నారు. చెడు అలవాట్లకు ప్రభావితం కావద్దని, అలా ఎవరైనా ప్రభావితం అయితే వారి జీవితం నాశనం అవుతుందన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చెప్పిన మాట వింటూ ఉన్నత భవిష్యత్తు సాధించుకునేందుకు పడాలని సీఐ సూచించారు.

ఆక్వా రైతులు ఆధార్ లింక్ చేయించుకోవాలి



ఆక్వా భూములను ఆధార్‌తో లింక్ చేయించుకోవాలని రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎఫ్‌డీఓ సతీష్‌కుమార్

దెందులూరు: మండలంలో ఆక్వా రైతులు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తమ భూములను ఆధార్ లింక్ చేయించుకోవాలని మత్స్యశాఖ దెందులూరు మండలం ఆఫీసర్ ఏ సతీష్ కుమార్ తెలిపారు. గురువారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ ఏపీ సీడ్ చట్టం ప్రకారం ఆక్వా చెరువుల నమోదు ప్రక్రియ వేగవంతంగా మత్స్యశాఖ అధికారులు సిబ్బంది సహాయ సహకారాలు ప్రణాళికతో జరుగుతుందన్నారు. ఇప్పటికే 7000 ఎకరాలు నమోదు చేయడం జరిగిందన్నారు. మిగిలిన రెండు వేల ఎకరాల నమోదు ప్రక్రియ త్వరితగతన పూర్తి చేస్తామన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలు పరిగణలోకి తీసుకొని ఆక్వా రైతులు నమోదు ప్రక్రియకు పూర్తి సహాయ సహకారాలు గ్రామస్థాయిలో మత్స్యశాఖ సిబ్బందికి అందించాలని ఆయన కోరారు.

టపాసులు కాల్చే తరుణంలో అశ్రద్ధ వద్దు



భీమడోలులో అగ్నిప్రమాదాలపై అవగాహన దృశ్యం

భీమడోలు: దీపావళి టపాసులు కాల్చే తరుణంలో జాగ్రత్తలు పాటించి ఆనందంగా జరుపుకోవాలని భీమడోలు అగ్ని మాపక ధికారి వి.రవికుమార్ అన్నారు. భీమడోలులో గురువారం పాఠశాలలో విద్యార్థులకు అగ్నిమాపక సిబ్బందిచే దీపావళి పండుగలో టపాసులు కాల్చేటప్పుడు తీసుకోవాలని జాగ్రత్తలు, మెలకువలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల ఉపాధ్యాయులు, ఫైర్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వేతన బకాయిలు చెల్లించాలి

ఏలూరు (టూటౌన్) / ఏలూరు (ఆర్ఆర్‌పేట) : మధ్యాహ్నం భోజనం పథకం కార్మికులకు మూడు నెలల వేతన బకాయిలు తక్షణమే చెల్లించాలని ఏపీ మధ్యాహ్నం భోజన పథకం కార్మికుల యూనియన్ (సీఐటీయూ) జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు చంద్రకళ, ఎం నాగమణి ఒక ప్రకటన విడుదల చేశారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్నబడి భోజనం పథకంలో జిల్లాలో పనిచేస్తున్న 3200 మంది కార్మికులు మూడు నెలల నుంచి వేతనం కానీ, బిల్లులు కానీ ప్రభుత్వం చెల్లించలేదని పేర్కొన్నారు. ఈ పథకాన్ని ఇప్పటికే కార్మికులు తన సొంత పెట్టుబడులతో నిర్వహిస్తున్నారని వివరించారు. ఈ పథకానికి వెంటనే బడ్జెట్ కేటాయించాలని, కార్మికులకు నెలనెలా 5వ తేదీలోపు వేతనం చెల్లించాలని, యూనిఫామ్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

కష్టపడితేనే కలల సాకారం

గణపవరం: విద్యార్థులు కలలుకనడమే కాకుండా కష్టపడితేనే ఆకలలు సాకారమవుతాయని, ఆదిశగా విద్యార్థులు ముందుకు సాగాలని ఎస్ఆర్‌ఐ, విష్ణుబొట్ల రామన్నలచ్చన్న చారిటబుల్‌ట్రస్ట్ చైర్మన్ విష్ణుబొట్ల లచ్చన్న అన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా గణపవరంలోని బాలుర ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కాలేజిలలో ఉత్తమ ఫలితాలు సాధించిన ముగ్గురేసి విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు, మెమొంటోలు అందిస్తున్నారు. దీనిలో భాగంగా గురువారం ఆయన నాలుగు విద్యాసంస్థలలోని ఉత్తమ విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. ప్రథమ స్థానం విద్యార్థికి రూ.40వేలు, ద్వితీయ రూ.20వేలు, తృతీయ విద్యార్థికి రూ.10 వేలు చొప్పున నగదు బహుమతులను అందజేశారు.

